# హీరోలా? జీరోలా?

అరిజోనా రాష్ట్రంలోని బెంటన్ కౌంటీకి చెందిన ఇద్దరు పోలీసు అధికారులు జో ఆర్పియో, ఏండీ లీ కఠినమైనవారనే పేరు తెచ్చుకున్నారు. వారు ఖైదీలను ఖాళీగా ఉంచకుండా పని చేయిస్తున్నారు. ఎడారిలోని టెంట్లలో వారిని ఉంచి దగ్గర్లోని ఊర్ల రోడ్ల పక్కన చెత్తను శుభ్రం చేయించారు. అప్పుడు ఖైదీలు పారిపోకుండా 18వ శతాబ్దంలోలాగ కాళ్లకి సంకెళ్లు వేశారు. వారికి పెట్టే భోజనం కూడా చవకదే. ఖైదీలకు టీవీ, రేడియో, సిగరెట్లు, పొగాకు, చాక్లెట్స్ నిషిద్ధం. తర్వాత పత్రికల్ని కూడా వారికి నిషేధించారు. వారు జైల్లో తమ గదుల్లో ఉంటే సిమెంట్ రంగు గోడలు, ఇనుప చువ్వలు తప్ప చూడటానికి ఇంకేం ఉండవు.



అనేకమంది స్వాతంత్ర ప్రియులు, ప్రజాస్వామ్య పిపాసులు వీరి పద్ధతులని ఆక్షేపిస్తే వారి మాటలను కొట్టి పారేస్తూ, 'పన్నులు చెల్లించే వారి ధనాన్ని ఈ నేరస్థుల సరదాకోసం ఖర్చు చేయడం సబబు కాదు. ఇళ్లల్లో దొరికే ఈ సుఖాలు కావాలంటే నేరాలు చేయకుండా ఇంటి పట్టునే ఉండాలన్న సందేశం వారికందేలా మేము జైలుని నిర్వహించదలచుకున్నాం' అన్నారు.

అమెరికన్ టీవీలు దీన్ని పాజిటివ్‌గా ప్రసారం చేస్తూ వీరిద్దరినీ అమెరికన్ హీరోలుగా కీర్తించడం గమనార్హం. 'జైలును దుఃఖకరమైన అనుభవంగా మారిస్తే మరోసారి నేరస్థులు జైలుకు రావడానికి జంకుతారు' అన్న అంశానికి న్యూయార్క్ పోస్ట్, యు.ఎస్.ఎ. టుడే పత్రికలు సానుకూలంగా వ్యాసాల్ని ప్రచురించాయి.

అమెరికాలో చట్టాలు పాలకులకు, బ్యూరోక్రసీకి విపరీతమైన అధికారాలు కట్టబెడుతుండటంతో ఇలాంటివి కొనసాగిస్తుంటారు. అందువల్లనే అక్కడ ఇలాంటి ప్రయోగాలు అమలు చేస్తుంటారని విమర్శ ఉంది.

# టీ బ్యాగ్స్ చరిత్ర

తేయాకు వాడుకకు మూడు శతాబ్దాల చరిత్ర ఉంది. భారతదేశంలోని ఈస్టిండియా ట్రేడింగ్ కంపెనీకి బ్రిటిష్ రాణి ఎలిజబెత్-1 తేయాకు వ్యాపార హక్కులిచ్చి, వచ్చిన లాభంలో మూడోవంతు స్వీకరించేది. ఆ రోజుల్లో వెండిని ఇచ్చి తేయాకును చైనా నుంచి దిగుమతి చేసుకునేవారు. 1830లో బ్రిటిష్‌వారు అస్సాంలో టీ ఎస్టేట్లను అభివృద్ధి చేశారు. అనేక లక్షల టీ మొక్కలను నాటించారు. ఈ ఎస్టేట్లలో పనిచేయడానికి పసివారిని బలవంతంగా వినియోగించారు. వారిలో ముప్పై శాతం బాలికలే. వారి వేళ్లు సన్నగా, మృదువుగా ఉండి, తేయాకుని కోయడానికి అనుకూలంగా ఉంటాయి. 1855నాటికి ఐదులక్షల పౌన్ల తేయాకుని బ్రిటన్‌కు ఎగుమతి చేయసాగారు. 1880 నాటికి ఇది రెట్టింపయింది.

తేయాకుకు కాఫీ ఏనాడూ పెద్ద పోటీ కాలేదు. ఇరవయ్యో శతాబ్దంలో తేయాకును చిన్న సంచుల్లో కట్టి వాటిని డీలర్స్ దగ్గరకు, అమెరికాలో లిప్టన్ టీ కంపెనీ శాంపిల్స్‌గా పంపేది. ఆ బ్యాగ్‌ని కొందరు వేడి నీళ్లలో కాస్సేపు ఉంచి, టీ చేసుకుని తాగేవారు. ఈ సంగతి తెలిసిన ఆ కంపెనీకి టీ బ్యాగ్స్ తయారుచేయాలన్న ఆలోచన కలిగింది. దానిమీద రీసెర్చి చేసి



టీ బ్యాగ్స్‌ని తయారుచేసే యంత్రాన్ని కనుగొంది. ఆ తర్వాత టీ బ్యాగ్స్‌కు ప్రజలనుంచి ఆదరణ లభించడంతో రోజుకు వంద టీ బ్యాగ్స్ తయారుచేసే యంత్రాన్ని అభివృద్ధి చేశారు. నేడు అమెరికాలో అరవై శాతం టీ బ్యాగ్స్‌తో టీ చేసుకుంటారు. అక్కడ ఏడాదికి తొమ్మిదివేల కోట్ల టీ బ్యాగ్స్ అమ్ముడవుతున్నాయి. క్షణానికి 30 టీ బ్యాగ్స్‌ను తయారు చేసే యంత్రం, నిముషానికి 200 టీ బ్యాగ్స్‌ను చేసే యంత్రం ప్రస్తుతం అమెరికాలో వినియోగంలో ఉన్నాయి. అలాంటి ఒక్కో యంత్రానికి 2,500 కదిలే భాగాలు ఉన్నాయి. దారం, కాగితం, స్టేపిల్స్, తేయాకు పొడిని ఈ యంత్రంలో ఫీడ్ చేస్తే టీ బ్యాగ్స్ తయారయి బయటికి వస్తాయి.

లిప్టన్ కంపెనీకి పోటీదారైన టెట్లీ టీ కంపెనీ కూడా 1920 నుంచి టీ బ్యాగ్స్‌ని ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు టెట్లీ దగ్గర నిముషానికి 600 టీ బ్యాగ్స్ తయారు చేసే యంత్రాలు ఉన్నాయి. తేయాకులో 1200 రకాల రుచులు ఉన్నాయి. అది పండే నేల, వర్షపాతం, అక్కడి వాతావరణం మొదలైనవి తేయాకు రుచిని నిర్ణయిస్తాయి. ప్రతి టీ కంపెనీ అనేక రకాల తేయాకుని కలిపి ప్రత్యేక రుచి వచ్చేలా ఉత్పత్తి చేస్తుంది.

సెలెస్టియల్ సీజనింగ్ కంపెనీ అనేక రకాల పదార్థాలైన హైబిస్కస్, మింట్, లెమన్, జింజర్ తదితరాలను కలిపి 1970 నుంచి తేయాకు లేని హెర్బల్ టీని అమెరికాలో తయారు చేస్తోంది. రెడ్ జింజర్, పీపీ టైమ్ అనే సువాసనలు వెదజల్లే ప్రొడక్ట్స్ అక్కడ అధికంగా అమ్ముడవుతున్నాయి. విశేషమేమంటే హెర్బల్ టీకి మామూలు టీ బ్యాగ్స్‌కు ఉన్నట్లు దారం ఉండదు.

# ట్రాఫిక్‌లైట్ల పుట్టుపూర్వోత్తరాలు!

ట్రాఫిక్‌లైట్లని మొదటిసారి లండన్‌లోని బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ డిసెంబర్ 10, 1868న ఏర్పాటు చేసింది. దీన్ని రైల్వే ఇంజనీర్ జెపి నైట్ కనిపెట్టాడు. రాత్రిళ్లు ఆకుపచ్చ, ఎరుపు గ్యాస్ లైట్లు వెలిగేవి. ఈ లాంతర్లను లీవర్‌తో అటూ ఇటూ తిప్పి ట్రాఫిక్ కంట్రోల్ చేసేవారు. అయితే జనవరి 2, 1869న ఆ లాంతరు పేలిపోయింది.



ఆధునిక ఎలక్ట్రిక్ ట్రాఫిక్‌లైట్‌ని అమెరికాలో సాల్ట్‌లేక్‌సిటీలో 1912లో లెస్టర్ వైర్ కనిపెట్టాడు. ఓహియోలోని క్లేవ్‌లాండ్‌లో 5, ఆగస్టు 1914న 'అమెరికన్ ట్రాఫిక్ సిగ్నల్ కంపెనీ' నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసింది. జేమ్స్ హోగ్ డిజైన్ చేసిన ఈ ట్రాఫిక్ లైట్ మారినప్పుడల్లా ఓ బజ్జర్ హెచ్చరికగా మోగేది. 1920లో డెట్రాయిట్‌లో ఓ కూడలిలో మూడురంగుల లైట్లని ఏర్పాటు చేశారు. పోలీసు ఆఫీసర్ విలియం పోట్స్ దీన్ని కనిపెట్టారు. 1923లో గేరిట్ మోర్గాన్ ట్రాఫిక్ లైట్ల యంత్రానికి తొలిసారిగా పేటెంట్ తీసుకున్నాడు. ఒకదానికొకటి అనుసంధానించిన, చేత్తో లివర్ లాగే ట్రాఫిక్‌లైట్ల సముదాయాన్ని 1917లో సాల్ట్‌లేక్ సిటీలో ఏర్పాటు చేశారు. 1922లో టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో యాంత్రికంగా పనిచేసే ట్రాఫిక్‌లైట్లు ఏర్పాటు చేశారు. అమెరికాలోనే పాదచారుల కోసం క్రాస్‌వాక్ సిగ్నల్‌గా పేర్కొనే ఈ లైట్లు కౌంట్‌డౌన్ పద్ధతిలో పనిచేస్తాయి. ప్రస్తుతం అమెరికాలో సెన్సార్ కెమెరాలని ఉపయోగించి, రెడ్‌లైట్ ఉండగా వెళ్ళే వాహనాలని ఫొటోలు తీసే కెమెరాలని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఉపయోగిస్తున్నారు.

# అప్పుల అప్పారావు



లునించి తప్పించుకున్న నేరస్థుడు గ్రాహంలీవర్(53) ఇంగ్లండ్‌నుంచి అమెరికా పారిపోయాడు. అక్కడ అతను మారుపేరుతో చలామణి అయ్యాడు. తను డిప్లొమేట్‌ననో, బ్రిటిష్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌ననో కట్టుకథలు చెప్పి ఆడవాళ్లను లాస్‌ఏంజెలెస్‌లో మోసగించి చాలా డబ్బు గడించాడు.



ఓ మహిళకి ముందుగా తను రాసే పుస్తకం గురించి చెప్తాడు. ఆ పుస్తకంవల్ల అడ్వాన్స్‌గా రాయల్టీ వచ్చిందని, దాన్ని సినిమాగా తీస్తున్నారని, తాను బ్రిటీష్ క్వీన్ ఒకప్పటి రహస్య ప్రియుడినని, ఆ రహస్యాలు ఆ పుస్తకంలో ఉంటాయని నమ్మిస్తాడు. తనకి మిగిలిన రాయల్టీ రాగానే డబ్బు వెనక్కిస్తానని వారినుంచి అప్పు తీసుకుంటాడు. ఇందుకు పబ్లిషర్స్‌తో, సినిమా స్టూడియోతో చేసుకున్న దొంగ ఒప్పంద పత్రాలను చూపిస్తాడు. హాలీవుడ్‌లోని ప్రముఖులతో తీయించుకున్న ఫొటో ఆల్బమ్‌నూ చూపిస్తాడు. తన మాటలతో చాకచక్యంగా ఆకట్టుకుని తను ఓ గొప్ప వ్యక్తిగా వాళ్ళకి ఇంప్రెషన్ ఇస్తాడు. అలా అమెరికా అంతటా ఇరవై లక్షల డాలర్లని రెండేళ్ళలో అనేక మంది మహిళల నుంచి అప్పు తీసుకుని ఎగ్గొట్టాడు. ఖరీదు చేసే సూట్లు ధరించి, ఖరీదైన రెస్టారెంట్స్‌కి తీసుకెళ్లి అతను వారికోసం 500 డాలర్ల బిల్లును చెల్లిస్తాడు. వారిని వివాహం చేసుకునే ఆసక్తి ఉన్నట్లు నటిస్తాడు. తను వారికి మానసికంగా దగ్గరయ్యేలా నటించి అప్పుడు అప్పు అడుగుతాడు. ఆ తర్వాత మాయమవుతాడు. ఫ్లోరిడా పోలీసులు అతడి కోసం తీవ్రంగా వేటాడుతున్నారు. ఇతని మీద కొత్త ఫిర్యాదులు ఎఫ్‌బిఐకి వివిధ పోలీస్ స్టేషన్స్‌నుంచి అందుతూనే ఉన్నాయి.